# బీఆర్ఎస్‌తోనే సింగరేణికి మనుగడ

- సీఎం కేసీఆర్‌తోనే కార్మికులకు మరిన్ని హక్కులు సాధ్యం
- బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్
- శాంతిఖని గని ఆవరణలో గేట్ మీటింగ్



బెల్లంపల్లి : శాంతిఖని గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

బెల్లంపల్లి, నవంబర్ 21: సీఎం కేసీఆర్‌తోనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్ స్పష్టం చేశారు. శాంతిఖని గని ఆవరణలో టీబీజీకేఎస్ గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గ చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐ అనుబంధ సింగరేణి గుర్తింపు సంఘాలు కార్మికులకు ఉన్న హక్కులు పోగొట్టాయే తప్పా కొత్తగా ఏమీ సాధించలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని వెల్లడించారు. అప్పటి సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను తిరిగి కారుణ్య నియామకాలతో తీసుకువచ్చిన ఘనత కేవలం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు కాపాడుకున్న సింగరేణి ఇక ముందు కూడా నిలువాలంటే మరోసారి సీఎంగా కేసీఆరే ఉండాలన్నారు. సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లను ఇటీవల బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే కేసీఆర్ అడ్డుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మరే సర్కార్ ఉన్నా సింగరేణి ప్రైవేట్ పరమవుతుందన్నారు. కార్మికులకు కారుణ్య ఉద్యోగాలను కల్పించింది కేసీఆరేనన్నారు. కోలిండియాలో లేని అనేక హక్కులను కార్మికులకు కల్పించారన్నారు. పెర్క్స్‌పై పడే ఆదాయ పన్నులను ప్రభుత్వమే చెల్లిస్తున్నదని కేసీఆర్ మందమర్రి సభలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరోసారి బెల్లంపల్లిలో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఉంటున్న అపర కుబేరుడితో తాను తలపడుతున్నాని, పేదింటి బిడ్డనైనా తనను మూడవసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో వారి స్వార్థానికి మాత్రమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారే తప్పా కార్మికులపై సంక్షేమంపై వారికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఊసరవెల్లి సిగ్గుపడే విధంగా పూటకో పార్టీ మారుతున్నారని గడ్డం బ్రదర్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. నా కుటుంబంతో సహా ఇక్కడే ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న తనను మరోసారి ఆశీర్వదించి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**కేసీఆర్‌కు కార్మికులు బాసటగా నిలవాలి...**

**-టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్**

సింగరేణి కార్మికులకు అన్ని విధాలా హక్కులు, సౌకర్యాలు కల్పిస్తున్న కేసీఆర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్ పిలుపునిచ్చారు. కార్మికులకు వడ్డీలేకుండా రూ. 10 లక్షల గృహ రుణాలు చెల్లించినట్లు తెలిపారు. రుణాలతో ఏడాదికి రూ. 50వేల లాభం చేకూరుతుందన్నారు. గత గుర్తింపు సంఘాలు నామమాత్రంగా పెంచుతూ వస్తున్న లాభాల వాటాను కార్మికులకు 16 శాతం నుంచి 32 శాతానికి పెంచిందని వివరించారు. సింగరేణిలో సకల జనుల సమ్మెతోనే తెలంగాణ తెచ్చుకున్నాము, సాధించిన తెలంగాణను కాపాడుకునేందుకు మూడవసారి కేసీఆర్ సీఎం కావాల్సిన అవసరముందన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు సాధించాలంటే, భవిష్యత్‌లో కారుణ్య నియామకాలు పోకుండా ఉండాలంటే దుర్గం చిన్నయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 11 నియోజకవర్గాల్లోని సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్రకమిటీ సభ్యులు గెల్లి రాజలింగు, బడికెల సంపత్, ఏరియా నాయకులు వెంకటరమణ, రాజనాల రమేశ్, సిద్ధంశెట్టి సాజన్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రెబ్బెన : గోలేటిటౌన్‌షిప్ లో ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

**టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం**

రెబ్బెన, నవంబర్ 21:రెబ్బెన మండలం లోని కార్మిక క్షేత్రం గోలేటిటౌన్‌షిప్‌లో మంగళవారం రాత్రి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. గోలేటిటౌన్‌షిప్ లోని తెలంగాణ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించి కార్మిక వాడల్లో ఇంటింటికి వెళ్లి ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి ని భారీ మోజార్టీ తో గెలిపించాలని కొరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చెన్నూర్, నవంబర్ 21: శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. చెన్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పీవోలు, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి సిడం దత్తు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

బెల్లంపల్లి, నవంబర్ 21: ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పీవో, ఏపీవోలు ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రిటర్నింగ్ అధికారి బదావత్ సంతోష్ అన్నారు. బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయనతో పాటు కేంద్రం సాధారణ ఎన్నికల పరిశీలకులు విశ్వజిత్ దత్తా, బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి రాహుల్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

మంచిర్యాల అర్బన్, నవంబర్ 21 : తెలంగాణ వాడ బలిజ సేవా సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అండర్ బ్రిడ్జి వద్ద మత్స్యకారుల జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ గగ్గూరి రాజన్న, ఎర్రోళ్ల మల్లయ్య, బోడంకి మహేశ్, బొడెంకి చందు, గారె శంకర్, పిట్టల దశరథం, గగ్గూరి రాజేశ్, బొల్లె శ్రీనివాస్, ఎర్రోళ్ల రాశ్, సత్తయ్య, కుమార్, తిరుపతి, రాజన్న, మధునయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి మండలంలో..**

దండేపల్లి, నవంబర్21: దండేపల్లి మండల కేంద్రంలో అంతర్జాతీయ మత్స్య దినోత్సవాన్ని మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మత్స్యకారులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న పథకాలతో ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు మెంగు లింగన్న, ప్రధాన కార్యదర్శి గంగన్న, సభ్యులు నక్క ఆశాలు, గంగాధరి మల్లేశ్, కల్లూరి భీమయ్య, గరిగె నర్సయ్య, సిద్ది లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణుల వేటగాళ్ల అరెస్ట్

వేమనపల్లి, నవంబర్ 21 : విద్యుత్ తీగలు అమర్చి వన్య ప్రాణులను హతమార్చిన వేటగాళ్లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నీల్వాయి ఎఫ్ఆర్‌వో ఇక్బాల్‌హుస్సేన్ తెలిపారు. ఎఫ్ఆర్‌వో తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నీల్వాయి ఫారెస్ రేంజ్ పరిధిలోని కల్మలపేట బీట్ పరిధిలో నాలుగు రోజుల క్రితం నీల్వాయి గ్రామానికి చెందిన మంత్రి రాజం, దాసరి మధు, ఆవులమారి బాపు, సుద్దాల రాజేశ్, శాఖ మధునయ్య విద్యుత్ వైర్లు అడవిలో అమర్చగా మూడు అడవి పందులు మృతిచెందినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకుని పంది మాంసాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మంగళవారం బెల్లంపల్లి కోర్టులో నిందితులను హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాములు, బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 21: బెల్లంపల్లి పట్టణంలోని కాంటా ప్రాంతంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన పూదరి రమేశ్ (48) వద్ద రూ 6,300 విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. కొన్ని నెలలుగా తన ఇంటివద్ద బెల్ట్‌షాపు నడుపుతూ మద్యం అమ్ముతున్నట్లు తెలుపగా పంచనామా నిర్వహించి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బన్సీలాల్ తెలిపారు.

## సీవోఈలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికైన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు క్రీడాకారులు

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 21: బెల్లంపల్లి సీవోఈలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ముందుగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, తాళ్లగురిజాల ఏఎస్ఐ రాజన్న , కాసిపేట బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబూరావు పరిచయం చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కే భాస్కర్ బెస్ట్‌ఆఫ్ త్రి పద్ధతిలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సైదులు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో మంచి క్రమశిక్షణ అలవడుతుందన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టును సెక్రటరీ బాబూరావ్ అభినందించారు.

**రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..**ఎం.వేణు ,ఎ.వర్ధన్,ఎం.చరణ్ (బెల్లంపల్లి సీవోఈ), ఎ.తరుణ్(టీఎస్ మోడల్ స్కూల్,ఆసిఫాబాద్), జే.మల్లయ్య, ఎం.ప్రణీత్(టీఎస్ఆర్‌డబ్ల్యూఎస్,జైపూర్), ఎం.వెంకటరాజు, వర్ధన్ (టీఎస్ఆర్‌డబ్ల్యూఎస్,కాసిపేట) ఎంపికయ్యారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, నడిగోటి రాకేశ్, కుమ్మరి శ్రీకాంత్ అభినందించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 21: బెల్లంపల్లి మండలంలోని తాళ్లగురిజాల, మాలగురిజాల, దుగినెపల్లి, పెర్కపల్లి,బట్వాన్‌పల్లి, చంద్రవెల్లి, బూదాకలన్, చాకేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం బెల్లంపల్లి నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు విశ్వజిత్‌దత్తా పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు సీఐ రాజ్ కుమార్‌గౌడ్,తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్ ఉన్నారు.



చంద్రవెల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశ్వజిత్ దత్త

## దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణిగుంట ప్రవీణ్



రేణిగుంట ప్రవీణ్‌ను సన్మానిస్తున్న నాయకులు, యువకులు

లక్షెట్టిపేట, నవంబర్ 21: రాష్ట్రంలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణిగుంట ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని కళాంజలి ఫంక్షన్ హాలులో మంగళవారం అంబేద్కర్ వాదులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ చైర్మన్‌గా పదవి కాలంలో మంచిర్యాల జిల్లాలో సుమారు రూ.30 కోట్లతో అన్ని హంగులతో నిర్మించి పాఠకులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇందులో చదివిన 140 మంది వివిధ ఉద్యోగాలకు కూడా ఎంపికయ్యారని తెలిపారు. లక్షెట్టిపేటలో కూడా సుమారు కోటి రూపాయలతో అన్ని హంగులతో మంచి గ్రంథాలయం నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన అంబేద్కర్ సంఘంతో పాటు ఎస్సీ, ఎస్టీ నాయకులు అంబేద్కర్ వాదులు ఆయనను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కొల్లూరి రవికుమార్, దర్శనాల నవీన్ కుమార్, కళ్లేపల్లి విక్రమ్, శాతరాజి ఈశ్వర్, మేకల దిలీప్, శనిగారపు శ్రీకాంత్, దావుల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.